# యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలికి ఘన సన్మానం

● ఈశ్వరమ్మ యాదవ్‌ను శాలువాతో సత్కరించిన చింతపల్లి కురుమ సంఘం నాయకులు





**చింతపల్లి, జూలై 2 (నేటి దర్శిని):** తెలంగాణ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా నియమితులైన ప్రశాంత్‌నగర్, వనస్థలిపురం సాయిబాబా దేవాలయ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ యాదవ్ను నల్గొండ జిల్లా చింతపల్లి మండలం కురుమేడు గ్రామ కురుమ సంఘం నాయకుడు నాదిరి మల్లేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా ఆమె సేవలు భక్తులకు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, కృష్ణతో పాటు కురుమ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# నసర్లపల్లి పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ

● చిన్నారులకు అక్షరాభ్యాసం చేసిన సర్పంచ్ మాలతి వెంకటయ్య





**చింతపల్లి, జూలై 2 నేటి దర్శిని :** విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా నసర్లపల్లి గ్రామపంచాయతీ ప్రాథమిక పాఠశాల (బీసీ కాలనీ)లో గురువారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పంబలి మాలతి వెంకటయ్య చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యే జీవితానికి బలమైన పునాది అని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పున్‌రెడ్డి సుమతి, ఉప సర్పంచ్ వడ్లకొండ నర్సింహా, వార్డు సభ్యులు రాశిక శివకృష్ణ, కర్నాటి నాగార్జున, గడిగంటి సంధ్య పాపారావు, బొడ్డుపల్లి పరమేష్, నల్ల అనురాధ, ప్రధానోపాధ్యాయురాలు కోరెక్క రేవతి, ఉపాధ్యాయులు పుష్పరాణి, ఝాన్సీ, వలబోతు ఆదినారాయణ, షేక్ నజీర్, బీరెల్లి మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుర్రంపోడులో ఘనంగా పాశం గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

● ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఎం.సి కోటిరెడ్డి



**గుర్రంపోడు,ద జూలై02(నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం గుర్రంపోడు మండల కేంద్రంలోని గోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తల సమక్షంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎం.సీ కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాశం గోపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాశం గోపాల్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకొని భవిష్యత్తులో ఉన్నతమైన పదవులు అధిరోహించి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పేర్కొన్నారు. పాశం గోపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా గుర్రంపోడు మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గుర్రంపోడు ప్రభుత్వ వైద్యశాలలోని పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు మండల బీఆర్ఎస్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో రాయినిగూడెం రోడ్డు,కల్వర్టులుతక్షణమే రోడ్డు నిర్మాణంతో పాటు హై లెవెల్ వంతెనలు నిర్మించాలి





● మాజీ సర్పంచ్ ఏ.సీ. నరసింహ

**చింతపల్లి, జూలై 2 (నేటి దర్శిని):** చింతపల్లి మండలంలోని రాయినిగూడెం గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి, మార్గంలోని లో-లెవెల్ కల్వర్టులు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ మాజీ సర్పంచ్ ఏ.సీ. నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. గత 12 ఏళ్లుగా ఈ సమస్య అలాగే కొనసాగుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదని గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.రాయినిగూడెం సమీపంలో నరసింహాపురం నుంచి వర్కాల వరకు సుమారు ఆరు కిలోమీటర్ల పరిధిలో నాలుగు భారీ వాగులు ఉన్నాయని, వాటిపై నిర్మించిన లో-లెవెల్ కల్వర్టులు వర్షాకాలంలో నీట మునిగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని చెప్పారు. భారీ వర్షాల సమయంలో వాగులు ఉధృతంగా ప్రవహించడం వల్ల వాహనదారులు, బాటసారులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, గతంలో వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. అందువల్ల ఈ వాగులపై శాశ్వత పరిష్కారంగా హై లెవెల్ వంతెనలు నిర్మించడంతో పాటు రాయినిగూడెం--చింతపల్లి రహదారిని తక్షణమే పునర్నిర్మించాలని మాజీ సర్పంచ్ ఏ.సీ. నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడకముందే అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# పచ్చని సంసారాల్లో వివాహేతర సంబంధాల చిచ్చు..

● కుటుంబ వ్యవస్థకు పెరుగుతున్న ముప్పు
● క్షణికానందం కోసం జీవితాలను నాశనం చేసుకుంటున్న ఘటనలు
● కుటుంబ విలువల క్షీణతతో ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు
● అవగాహన, పరస్పర నమ్మకమే కుటుంబ బంధాలకు బలమైన పునాది



**మేడ్చల్, జూలై 2 (నేటి దర్శిని):** రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఇటీవల వెలుగులోకి వస్తున్న కొన్ని కుటుంబ హత్యలు, వివాహేతర సంబంధాల నేపథ్యంలో చోటుచేసుకుంటున్న నేరాలు సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. క్షణికానందం కోసం తీసుకుంటున్న తప్పు నిర్ణయాలు పచ్చని సంసారాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, చిన్నారులను అనాథలుగా, వృద్ధులను దిక్కులేని వారిగా మార్చుతున్నాయి. ఈ పరిణామాలు కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సామాజిక వేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**క్షణికానందం కోసం జీవితాలనే పణంగా పెడుతున్న పరిస్థితి**

ఇటీవలి కాలంలో వెలుగులోకి వచ్చిన అనేక ఘటనల్లో వివాహేతర సంబంధాలు ప్రధాన కారణంగా ఉన్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి. కొందరు వ్యక్తులు తమ సంబంధాలకు కుటుంబ సభ్యులు అడ్డుగా ఉన్నారనే భావనతో భర్త, భార్య, పిల్లలు లేదా తల్లిదండ్రులపై దాడులకు పాల్పడిన ఘటనలు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఇలాంటి నేరాల వల్ల బాధిత కుటుంబాలు శాశ్వతంగా విషాదంలో మునిగిపోతుండగా, నిందితులు కూడా జైలు జీవితం గడపాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

**సాంకేతికత, సోషల్ మీడియా ప్రభావంపై ఆందోళన**

ప్రపంచీకరణ, స్మార్ట్‌ఫోన్ల విస్తరణ, సామాజిక మాధ్యమాల వినియోగం పెరగడం వల్ల మానవ సంబంధాలపై ప్రభావం పడుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా యువతలో సహనం, పరస్పర అవగాహన, కుటుంబ బంధాల పట్ల గౌరవం తగ్గుతోందని చెబుతున్నారు. అలాగే కొన్ని టెలివిజన్ కార్యక్రమాలు, ఓటీటీ వేదికలలోని వయోజన కంటెంట్‌ను విచక్షణారహితంగా వీక్షించడం కూడా కొంతమందిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పోలీసులు, మానసిక ఆరోగ్య నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. అయితే నేరాలకు ఒకే కారణాన్ని నిర్ధారించడం సాధ్యం కాదని, వ్యక్తిగత నిర్ణయాలు, కుటుంబ పరిస్థితులు, ఇతర సామాజిక అంశాలు కూడా ప్రభావం చూపుతాయని వారు సూచిస్తున్నారు.

**కుటుంబ విలువల పరిరక్షణే పరిష్కారం**

భారతీయ కుటుంబ వ్యవస్థ పరస్పర విశ్వాసం, ప్రేమ, త్యాగం, బాధ్యతలపై ఆధారపడి ఉంటుందని సామాజిక వేత్తలు పేర్కొంటున్నారు. కుటుంబ సభ్యులతో సమస్యలు తలెత్తినప్పుడు హింస లేదా నేర మార్గాన్ని ఆశ్రయించకుండా, సంభాషణ, కుటుంబ పెద్దల సలహాలు, కౌన్సెలింగ్ వంటి మార్గాలను ఎంచుకోవడం అవసరమని సూచిస్తున్నారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరిపై ఒకరు నమ్మకం పెంపొందించుకోవడం, పిల్లలకు కుటుంబ విలువలను చిన్నప్పటి నుంచే నేర్పించడం, పరస్పర గౌరవంతో జీవించడం ద్వారా ఇలాంటి విషాదకర ఘటనలను తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు. కుటుంబ సభ్యుల ఆనందాన్నే తమ ఆనందంగా భావించి బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. క్షణికానందం కోసం జీవితాలను నాశనం చేసుకునే నిర్ణయాలకు దూరంగా ఉండి, కుటుంబ బంధాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా నిపుణులు సూచిస్తున్నారు.

# చాంద్రాయణగుట్టలో కోటి డ్రగ్ హౌస్ 5వ బ్రాంచ్ ఘనంగా ప్రారంభం

**చాంద్రాయణగుట్ట,జూలై02 (నేటి దర్శిని):** చాంద్రాయణగుట్ట కందికల్ గేట్ రోడ్డులో బంగారు మైసమ్మ ఆలయం పక్కన కోటి డ్రగ్ హౌస్ 5వ బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆల్ పార్టీ నాయకులు, చాంద్రాయణగుట్ట సీఐ ఆర్. గోపి హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటు ధరల్లో లభించే విధంగా కోటి డ్రగ్ హౌస్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్య సేవలకు సంబంధించిన అన్ని రకాల మందులు ఒకే చోట అందుబాటులో ఉండడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని రకాల మెడికల్ ఔషధాలను టోకు, చిల్లర విక్రయాల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. సర్జికల్ పరికరాలు, ప్రత్యేక ఔషధాలు, వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా ఉచిత గృహ పంపిణీ సేవను అందిస్తున్నామని, అత్యవసర సమయాల్లో కూడా మందులను త్వరితగతిన ప్రజలకు చేరవేస్తామని తెలిపారు. ప్రతి ఔషధ కొనుగోలుపై ఏడాది పొడవునా 25 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు వెల్లడించారు.



సంస్థ నిర్వాహకులు ఉమాశంకర్, ఆనంద్ యాదవ్, సందీప్ మాట్లాడుతూ..చాంద్రాయణగుట్ట ప్రాంతంలో ఐదో బ్రాంచ్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన ఔషధాలు, విశ్వసనీయ సేవలు, సరసమైన ధరలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించి ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారవేత్తలు, వైద్య రంగానికి చెందిన పలువురు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఆన్లైన్లో మందులు కావలసినవారు 7675964242,7680847733లో నెంబర్ కి సంప్రదించగలరని తెలిపారు.

